# కన్యాశుల్కం



*ప్రచురయువాగ్రామో*
*మధుమాసో యౌవనం పతిఃస్థవిరః*
*జీర్ణ సురాస్వాధీనా*
*అసతీ మాభవతు కింమ్రియతాం*

***భావం:*** గ్రామంలో చాలామంది యువకులున్నారు. వసంత మాసం, నిండు జవ్వనం, ముసలివాడైన భర్త, పాతబడిన మద్యం. నన్ను పతితవు కావద్దంటే చచ్చిపొమ్మనా అర్థం.

ఒక ఎనభై ఏళ్ళ వృద్ధ ధనికుడికి భార్య మరణించింది. అతను పునర్వివాహం చేసుకుందామనుకున్నాడు. కొడుకులూ, కూతుళ్ళూ, మనవలూ

వద్దని చెప్పి చూశారు. నువ్వు పెళ్ళి చేసుకుంటే బంధం తెంచుకుంటామని బెదిరించారు."మీకివ్వాల్సిన ఆస్తి ఎన్నడో ఇచ్చేశాను. పోతేపొండి" అన్నాడు. పిల్లలు ఎవరిదారిన వాళ్ళుపోయారు. వృద్ధుడి కోరికకు బంధుమిత్రులు అసహ్యించుకున్నారు. చుట్టుపక్కల ఎవ్వరూ పిల్లనివ్వడానికి అంగీకరించలేదు. ఆటంకాలు ఎదురైన కొద్దీ వృద్ధుడిలో పట్టుదల పెరిగింది. చివరకు ఒక బీద కుటుంబాన్ని వెతికి, లక్ష రూపాయలు కన్యాశుల్కమిచ్చి, ఆ ఇంటి పెద్ద అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. అమ్మాయి తండ్రి లక్ష రూపాయలలో కొంత ధనంతో మిగిలిన ముగ్గురు కూతుళ్ళకీ మధ్యతరగతి వారితో పెళ్ళిళ్ళు చేసి, మిగిలిన ధనంతో భూమి కొనుక్కుని సుఖంగా జీవించసాగాడు.

వృద్ధుడు కొత్త భార్యతో "నీకే లోటు లేదు. ఇదిగో నీ సవతి చీరలూ, నగలూ, లేపనాలూ అన్నీనీవే. హాయిగా నాతో సుఖపడు." అన్నాడు. భర్తకు సేవా, అతనిచేత తిట్లూ, ఆమెకు రోజులు భారంగా గడవసాగాయి.

పుట్టింట్లో నలుగురు అమ్మాయిలూ కల్సుకున్నప్పుడు చెల్లెళ్ళు అక్కఒంటి మీద నగలూ, చీరలూ వీటిని చూసి చాలా అసూయ పడేవారు ఆమె విషాదంగా నవ్వుకునేది. నగలకన్నా, చీరలకన్నా ఆనందాన్నిచ్చే భర్త సాంగత్యమే మిన్న అన్న సంగతి వీళ్ళకి తెలియదు. ఎవరికైనా అంతే. తమకున్న దాని విలువ తెలియదు. లేని వాటికై ఆరాటపడడమే తెలుస్తుంది. ఆమె కష్టాన్ని ఇంటి పనిమనిషి అర్థంచేసుకుంది.

"అమ్మగారూ, మీ జీవితం ఆడవికాచిన వెన్నెల చేసుకోకండి. అన్యాయం జరిగిందని దుఃఖిస్తూ కూచుంటే ప్రయోజనం లేదు. మీ సుఖం మీరే చూసుకోవాలి. నేను సాయం చేస్తాను" అంది. ఆమె ముందు భయపడింది. ఆపైన తటపటాయించిది. ధార్మికమైన బుద్ధికీ, మానసికమైన వాంఛకీ మధ్య పోరాటం జరిగింది. చివరకు మనస్సు గెలిచింది. భర్తకు తెలియకుండా జాగ్రత్తపడింది. వృద్ధుడైన భర్త సేవలు యధావిధిగా చేసి ఆపైన ఆనందించసాగింది.

కొన్నాళ్ళకు వార్త మెల్లిగా పుట్టింటికి చేరింది. ఆమె తండ్రి పరిగెత్తుకుంటూ వచ్చాడు. పుట్టింటి పరువూ, చెల్లెలి కాపురాలూ నిలబెట్టమన్నాడు. ఆమె కళ్ళల్లో నిప్పులు రేగాయి."ఊరి నిండా యువకులు, వసంతకాలం, నిండుజవ్వనం, ముసలి భర్త, పాత మద్యం ఉండగా నన్ను పతితను కావద్దంటే మరణించమంటావా?" పద్యం పూర్తయ్యేసరికి తన దీనస్థితి జ్ఞాపకం వచ్చి వెక్కివెక్కి ఏడిచింది. ధనాశతో కూతురికి అన్యాయం చేశానని గ్రహించిన తండ్రి బదులు చెప్పలేకపోయాడు. పాపమెవరిది?కర్తదా లేక కారయితదా?

(కారయిత=చేయించినవాడు)

******